క్లుప్తంగా

అమ్మవారికి పూజలు


అమ్మవారిని దర్శించుకుంటున్న నాయకులు

మునిపల్లి(అందోల్): నవరాత్రోత్సవాల్లో భాగంగా ఖమ్మంపల్లిలో ఆదివారం మాజీ జెడ్పీటీసీ మీనాక్షి, మాజీ ఎంపీపీ ఉపాధ్యక్షుడు మల్లేశంగౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి దర్శనం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఆలయంలో హనుమాన్ చాలీసా పారాయణం


పారాయణంలో పాల్గొన్న భక్తులు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని కోదండ సీతారామస్వామి దేవాలయంలో ఆదివారం భజరంగ్‌దళ్ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేకపూజలు నిర్వహించి, హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. కార్యక్రమంలో భజరంగ్‌దళ్ కమిటీ సభ్యులు మధురనేని శేషాద్రి, న్యాయవాది నాగరాజు యాదవ్, భక్తులు పాల్గొన్నారు.

కేతకీలో ప్రత్యేక పూజలు


పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే, తదితరులు

ఝరాసంగం(జహీరాబాద్): మొగలివనంలో వెలసిన కేతకి సంగమేశ్వర ఆలయంలో బీదర్ సౌత్ ఎమ్మెల్యే శైలేందర్ బిల్దాలె ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి పూజలు చేశారు. వారికి అర్చకులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. గర్భగుడిలోని పార్వతీపరమేశ్వరులకు అభిషేకం, కుంకుమార్చన, మహామంగళహారతి తదితర పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు పూలమాల, శాలువాతో సన్మానించి, స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అలయ్ బలయ్‌లో నేతలు


గిరిధర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన నేతలు

జహీరాబాద్ టౌన్: దసరాను పురస్కరించుకుని నిర్వహించిన అలయ్ బలయ్‌లో రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు. పట్టణంలోని ఆదర్శనగర్ కాలనీలోని ఆయన నివాసంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ నాయకులు తన్వీర్ తదితరులు పండగ శుభాకాంక్షలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో నిమజ్జన వేడుకలు


నిమజ్జనంలో పాల్గొన్న అధికారులు, గ్రామస్తులు

ఝరాసంగం(జహీరాబాద్): విజయదశమిని పురస్కరించుకుని దక్షిణకాశిగా ప్రసిద్ధి చెందిన కేతకి సంగమేశ్వర ఆలయంలో తొమ్మిది రోజుల పాటు దేవీ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. దసరా రోజున రాజరాజేశ్వరిదేవి రూపంలో దుర్గామాత దర్శనమిచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ఆలయాధికారులు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మతిస్థిమితంలేని వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: మతిస్థిమితంలేని వ్యక్తి మృతి చెందిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని ఐనోల్ గ్రామానికి చెందిన మల్లమ్మ భర్త మహిపాల్ గత 14 సంవత్సరాల నుంచి మతిస్థిమితం సరిగ్గాలేక డివిజన్ పరిధిలోని కిందిబస్తీలో అతని అమ్మ వద్ద ఉంటున్నాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని చిన్నవాగు సమీపంలోని శ్మశాన వాటిక రోడ్డు పక్కన పడి ఉన్నాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించగా పరిశీలించిన వైద్యులు మృతి చెందినట్లు వెల్లడించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

దసరా వైభవం


పటాన్‌చెరు టౌన్: రావణదహన కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు

విజయదశమి వేడుకలు జిల్లా వ్యాప్తంగా అంగరంగ వైభవంగా ప్రజలు జరుపుకొన్నారు. అమ్మవారి మండపాలు భక్తులతో కిటకిటలాడాయి. పలుచోట్ల రావణ దహనం కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ప్రజలు భారీగా హాజరై తిలకించారు. అలాగే జమ్మిచెట్టు వద్ద శమిపూజ చేశారు. అనంతరం ప్రజలు, పార్టీ నాయకులు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.


పటాన్‌చెరు టౌన్: పూజల్లో కాంగ్రెస్ నేత మధు


రామచంద్రాపురం: భారతినగర్‌లో..


జహీరాబాద్: శమీపూజలో ఎమ్మెల్యే మాణిక్‌రావు


పటాన్‌చెరు టౌన్: శమీపూజలో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ,కార్పొరేటర్ కుమార్ తదితరులు


సదాశివపేట పట్టణంలో..


హత్నూర:జమ్మిచెట్టుకు పూజచేస్తున్న గ్రామస్తులు


కల్హేర్: ఖానాపూర్(కె)లో..


న్యాల్‌కల్: పూజలు చేస్తున్న బ్రాహ్మణులు


న్యాల్‌కల్: ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు


ఇస్మాయిల్ ఖాన్‌పేటలో..


పటాన్ చెరు: వేడుకల్లో గాయని మంగ్లీ


పటాన్ చెరు: పాడుతున్న గాయని మధుప్రియ


జహీరాబాద్ టౌన్: ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు..


నారాయణఖేడ్: కార్యకర్తలతో ఎమ్మెల్యే..


జోగిపేట(అందోల్): జోగిపేటలో..

‘భగీరథ’ను నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం

నారాయణఖేడ్: ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలనే ఉద్దేశంతో బీఆర్‌ఎస్ ప్రవేశపెట్టిన మిషన్ భగీరథ పథకాన్ని ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సంజీవన్‌రావుపేట్‌లో కలుషిత నీరు తాగి అస్వస్థతకు గురై ఖేడ్ ప్రాంతీయ ఆస్పత్రి, గ్రామంలో చికిత్స పొందుతున్న బాధితులను ఆదివారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. ప్రభుత్వం స్వచ్ఛమైన తాగునీటిని అందించే పరిస్థితిలో లేకపోవడంతోనే కలుషితనీరు తాగి గ్రామస్తులు ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారన్నారు. ఆయన వెంట మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పరమేష్, మున్సిపల్ మాజీ చైర్మన్ నజీబ్, పరశురాం, పట్టణ పార్టీ అధ్యక్షుడు నగేష్, సాయిరెడ్డి, నవాబ్, సంగప్ప ఉన్నారు.


బాధితుడిని పరామర్శిస్తున్న భూపాల్‌రెడ్డి

ప్రతి కార్యకర్తను కాపాడుకుంటాం

కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్

పటాన్ చెరు టౌన్: బీఆర్‌ఎస్ పార్టీ ప్రతి కార్యకర్తను కాపాడుకుంటుందని కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ అందజేశారు. పటాన్‌చెరు డివిజన్‌లోని జేపీ కాలనీలో పార్టీ కోసం కష్టపడుతున్న 18 మంది మహిళా కార్యకర్తలకు స్కూటీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పటాన్‌చెరులో బీఆర్‌ఎస్ పార్టీ గత మూడు దఫాలుగా అధికారంలోకి రావడానికి మహిళా కార్యకర్తల కృషి ఎంతో ఉందన్నారు. అనంతరం మహిళా కార్యకర్తలు మాట్లాడుతూ.. గత పది సంవత్సరాలుగా బీఆర్‌ఎస్ పార్టీ విజయం కోసం ఎంతో శ్రమించామని, ఎవరూ సరైన గుర్తింపు ఇవ్వలేదని, కాని కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ గుర్తించి ఎలక్ట్రికల్ స్కూటీలు అందజేయడం సంతోషంగా ఉందన్నారు. ఆయనకు రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మహిళా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


స్కూటీలు అందజేస్తున్న కుమార్‌యాదవ్

మహాసభలను విజయవంతం చేయండి

జహీరాబాద్ టౌన్: ఈ నెల 19 నుంచి ప్రారంభం కానున్న సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా కార్యవర్గ సభ్యులు, ఆహ్వాన సంఘం అధ్యక్షుడు బి.రాంచందర్ కోరారు. శ్రామిక్ భవనంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 19, 20 తేదీల్లో పట్టణంలోని షెట్కార్ ఫంక్షన్ హాల్‌లో మహాసభలను నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర, జిల్లా నాయకులు హాజరవుతున్న సభలకు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, ప్రజలు కదిలిరావాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు తుల్జరాం, నరేష్, శంకర్, రాజు, గోపాల్, నర్సింలు, బాలయ్య, అంజమ్మ, తుల్జమ్మలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాంచందర్

ప్రతిభావంతులకు సన్మానం

కల్హేర్(నారాయణఖేడ్): ఎంబీబీఎస్, డీఎస్సీ ఫలితాల్లో ప్రతిభ కనబర్చిన యువకులకు మండలంలోని ఫత్తేపూర్‌లో ఆదివారం గ్రామస్తులు సన్మానం చేశారు. గ్రామానికి చెందిన పెద్దోళ్ల రమేష్ ఉచిత ఎంబీబీఎస్ సీటు సాధించాడు. కడల హన్మంతు డీఎస్సీ ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించాడు. ఈ మేరకు వారిని మాజీ సర్పంచ్ కవిత ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పెద్దోళ్ల సాయిగోండ, గ్రామస్తులు సుభాష్, సాయిగౌడ్, యువజన సంఘాల సభ్యులు పాల్గొన్నారు.


రమేష్‌ను సన్మానం చేస్తున్న గ్రామస్తులు

నిమజ్జనానికి తరలిన దుర్గామాత

సంగారెడ్డి టౌన్: దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సంగారెడ్డి పట్టణంలో తొమ్మిది రోజుల పాటు వివిధ రూపాల్లో అమ్మవారిని అలంకరించి పూజించారు. ఆదివారం దుర్గామాత విగ్రహ నిమజ్జనాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళల ఆటపాటలు, డప్పుల చప్పులు, కళాకారుల విన్యాసాలతో వైభవంగా సాగింది. మాలధారణ భక్తులు అమ్మవారికి ప్రత్యేక చేశారు. కార్యక్రమంలో పట్టణవాసులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


భవానిమాతను ఊరేగిస్తున్న భక్తులు

ఎమ్మెల్యేకు ఆహ్వానం

చేగుంట(తూప్రాన్): మండలంలోని చందాయిపేటలో వీరహనుమాన్ ఆలయ వార్షికోత్సవంలో పాల్గొనాలని దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డికి ఆహ్వాన పత్రిక అందించినట్లు మాజీ ఎంపీటీసీ నగేష్ తెలిపారు. దుబ్బాకలో ఎమ్మెల్యేను కలిసి ఈ నెల 15 నుంచి 17 వరకు నిర్వహించే వీరహనుమాన్ ఆలయ వార్షికోత్సవ పూజలకు రావాలని కోరినట్లు చెప్పారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో గ్రామ నాయకులు శోభన్, ప్రదీప్, నాగరాజు, మల్లేశ్, రాజు, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

అమ్మవారి లడ్డూ రూ.1.10 లక్షలు


అమ్మవారి పూజల్లో నాయకులు

పాపన్నపేట(మెదక్): మండల పరిధిలోని కొడుపాకలో దేవి నవరాత్రుల్లో భాగంగా అమ్మవారి లడ్డూను గ్రామానికి చెందిన భూమేశ్ రూ.1,10,010 కు కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు సతీశ్, మహేశ్, మోహన్, గ్రామస్తులు పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు.

శివాజీ విగ్రహ నిర్మాణానికి భూమిపూజ

కొల్చారం(నర్సాపూర్): రంగంపేటలోని బస్టాండ్ ఆవరణలో ఛత్రపతి శివాజీ నూతన విగ్రహ ఏర్పాటుకు శనివారం భూమిపూజ నిర్వహించారు. గ్రామ యువత ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమానికి రంగంపేట ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద స్వామి హాజరై విగ్రహ మార్గనిర్దేశం చేశారు. కార్యక్రమంలో యువకులు పాల్గొన్నారు.

9మందిపై కేసు నమోదు

శివ్వంపేట(నర్సాపూర్): భూ వివాదంలో గొడవ పడిన 9 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని నవాబుపేట గ్రామానికి చెందిన అన్నదమ్ములు విఠల్‌రెడ్డి, రాఘవరెడ్డిల మధ్య శనివారం రాత్రి భూ వివాదంలో గొడవ పడి, దాడులు చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

తల్లి, కుమారుడు అదృశ్యం

చిన్నశంకరంపేట(మెదక్): కుటుంబ కలహాలతో తల్లి, కుమారుడు అదృశ్యమైన ఘటన నార్సింగి మండలం శేరిపల్లిలో చోటు చేసుకుంది. నార్సింగి ఎస్‌ఐ అహ్మద్ మోహినొద్దీన్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన చెప్యాల బాబు మెడ్చల్‌లో నివాసం ఉంటూ దసరా పండుగకు స్వగ్రామానికి వచ్చాడు. కాగా శనివారం భార్య జ్యోతితో గొడవపడి, గ్రామంలో దసరా ఉత్సవాలు చూసేందుకు వచ్చాడు. తిరిగి వెళ్లే సరికి ఇంట్లో భార్య, కుమారుడు కన్పించలేదు. ఇరుగు పొరుగు వద్ద, బంధువుల వద్ద వెతికినా.. వారి ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో భార్య, కుమారుడు కన్పించడంలేదని పోలీస్‌లకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సంప్రదాయాల పరిరక్షణలో భాగస్వాములవ్వాలి

ఆర్‌ఎస్‌ఎస్ సంఘ్ ప్రచారక్ శ్రీరామ్ ప్రసాద్

రాయికోడ్(అందోల్): దేశ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ప్రచారక్ శ్రీరామ్ ప్రసాద్ పిలుపునిచ్చారు. ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా రాయికోడ్‌లో పథ సంచలన్ (రూట్ మార్చ్) నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంత్ హెడ్గెవార్ ఆర్‌ఎస్‌ఎస్‌ను వందేళ్ల క్రితం 8 మందితో ప్రారంభించారన్నారు. నేడు లక్షల స్వయం సేవకులు దేశ సేవలో పాలుపంచుకుంటున్నారని అన్నారు. ఎక్కడా విపత్కర పరిస్థితులు వచ్చినా నిస్వార్థంగా సేవలు చేస్తున్నారని తెలిపారు. సంఘ్ శాఖల్లో పాల్గొంటే పిల్లలు, యువకులు సంపూర్ణ ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత పొందుతారన్నారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల స్వయం సేవకులు పాల్గొన్నారు.


శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొన్న స్వయం సేవకులు

తులసీరాం రాథోడ్‌కు సన్మానం

జహీరాబాద్ టౌన్: తెలంగాణ బంజారా ఎంప్లాయిస్ సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తులసీరాం రాథోడ్‌కు డాక్టరేట్ లభించిన సందర్భంగా ఆదివారం ఏబీటీఎఫ్ నాయకులు ఆయనను శాలువాతో సన్మానించి, జ్ఞాపికను బహూకరించారు. ఏబీటీఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు వినయ్‌పవార్ మాట్లాడుతూ.. తులసీరాం రాథోడ్ ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతూ గిరిజనులను చైతన్య పరిచేందుకు 30 సంవత్సరాలుగా కృషి చేస్తున్నారని కొనియాడారు. గిరిజనుల కోసం మరిన్ని సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు అశోక్‌జాదవ్, గోవింద్, తుకారాం, విజయ్, శ్రీనుజాదవ్, ఉపాధ్యాయులు ధర్మం సింగ్ పాల్గొన్నారు.


రాథోడ్‌ను సన్మానిస్తున్న నాయకులు

పొంచి ఉన్న ప్రమాదం

రాయికోడ్(అందోల్): మండలంలోని ఇటికేపల్లిలో జనావాసాల మధ్య కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్‌తో ప్రమాదం పొంచి ఉందని గ్రామ ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. కొన్నేళ్లుగా కంచె ఏర్పాటు చేయాలని విన్నవించినా పట్టించుకోవడంలేదని విద్యుత్ అధికారులపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నివాస గృహాల సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో పశువులు అటుగా వెళ్లి ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని వాపోతున్నారు. పిల్లలు ఆడుకుంటూ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ప్రమాదానికి గురైతే బాధ్యులెవరని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కంచె ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.


ఇటికేపల్లిలో కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్

తుల్జాపూర్‌కు తరలిన భక్తులు

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ ప్రజలు దసరా పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహిస్తారు. భవానిమాత దర్శనానికి జహీరాబాద్ నుంచి వేల సంఖ్యలో భక్తులు తుల్జాపూర్‌కు కాలినడకన వెళ్తుంటారు. దసరా పండుగకు ముందు తరువాత రెండు విడతలుగా పాదయాత్ర నిర్వహిస్తారు. దసరా పండగ తరువాత పాదయాత్ర ప్రారంభించిన వారు పున్నమి వరకు ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారు. ఈ మేరకు ఆదివారం తెల్లవారు జాము నుంచి భవాని భక్తులు పాదయాత్రను ప్రారంభించారు. ఒక్క జహీరాబాద్ పట్టణం నుంచే సుమారు 3 వేల మంది భక్తులు పాదయాత్రలో పాల్గొంటున్నారు. కాలినడక వెళ్లే భక్తులకు దారి పొడవునా సామాజిక సేవ కార్యకర్తలు సేవా కార్యక్రమాలు, భోజన సదుపాయం కల్పిస్తుంటారు. శనివారం రాత్రి నుంచి 65వ జాతీయ రహదారి వెంబడి అన్నదాన శిబిరాలు వెలిశాయి. సుమారు 180 కిలో మీటర్ల దూరంలో ఉన్న తుల్జాపూర్ వరకు అక్కడక్కడ సేవా కేంద్రాలు ఏర్పాటు చేస్తారు. మహారాష్ట్రలోని నల్లదుర్గం ప్రాంతంలో మరీ ఎక్కువగా కనిపిస్తాయి. ఇప్పటికే లారీలో నిత్యావసర సరుకులు తీసుకుని బయలుదేరి వెళ్లారు. జహీరాబాద్‌తో పాటు నారాయణఖేడ్, సదాశివపేట, సంగారెడ్డి, వికారాబాద్, తాండూర్ తదితర ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో భక్తులు తుల్జాపూర్‌కు తరలివెళ్తున్నారు.


సత్వార్ వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కేంద్రం

సద్వినియోగం చేసుకోవాలి

శివ్వంపేట(నర్సాపూర్): మండల ప్రజల కోసం ఉచితంగా అందిస్తున్న మినరల్ వాటర్‌ని సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ నాయకుడు నవీన్‌గుప్తా అన్నారు. తన తల్లిదండ్రులైన దివంగత అంజమ్మ మల్లేశంల జ్ఞాపకార్థం శనివారం మండల కేంద్రం శివ్వంపేటలో ఉచిత మినరల్ వాటర్ పంపిణీ ప్రారంభించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ఆనందరావు వాటర్‌ప్లాంట్ నుంచి మినరల్ వాటర్‌ను ఉచితంగా తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ప్రభులింగంగౌడ్, గణేశ్, గౌరీశంకర్, శ్రీనివాస్, రాజు, ఆంజనేయులు, తదితరులు ఉన్నారు.